# వాణి నా రాణి
# బిల్హణీయము

## తిరుమల కృష్ణ దేశికాచార్యులు

ఎమెస్కో

# వాణి నారాణి

## పాత్రలు

| | |
|---|---|
| పినవీరభద్రుడు | — కథానాయకుడు, ఆంధ్రకవిపుంగవుడు |
| పెదవీరభద్రుడు | — పినవీరభద్రుని అన్నగారు |
| గాదిరాజు | — పినవీర, పెదవీరభద్రుల తండ్రి |
| నాగాంబిక | — పినవీర, పెదవీరభద్రుల తల్లి |
| సాళువ నరసింహరాయలు | — విజయనగరరాజ్యప్రభువు |
| భారతీతీర్థస్వామి | — గాదిరాజ,వీరభద్రాదుల గురువు |
| చిల్లర వెన్నయామాత్యుడు | — శృంగారశాకున్తలకృతిభర్త |
| సింగన | – వ్రాయసకాడు |
| మదాలస | — విజయనగరాస్థాననర్తకి |
| మణిప్రభ | — మదాలస సేవిక |

ఇంకను మంత్రి, సేవికలు, సదస్యులు, పురోహితుడు, బ్రాహ్మణులు మున్నగువారు.

---

✻ ఈగుర్తు గల పద్యములు ఈ నాటకకర్త వ్రాసినవి. ఈగుర్తు లేని పద్యములు పినవీరభద్రుని శృంగారశాకున్తలమునుండియో, జైమినిభారతమునుండియో గ్రహింపబడినవి. 'కుల్లా యుంచితి' అను పద్యము శ్రీనాథుని చాటువు. గీతము లన్నియు ఈనాటకకర్త వ్రాసినవే. 'సువక్షోజకుమ్భాం' అను శారదాస్తోత్రము శ్రీజగద్గురు ఆదిశంకరాచార్యకృతము. 'జయంతి తే...' అను శ్లోకము భర్తృహరి సుభాషితముల లోనిది. 'యః పఞ్చశాఖాభిర్జిత్వా' అను శ్లోకము దేవులపల్లి తామ్రశాసనములోనిది. ఈశాసనవిషయమును తమ పరిశోధనవ్యాసంద్వారా తెలియజేసిన శ్రీఏల్చూరి మురళీధరరావుగారికి నా కృతజ్ఞతలు.

◊ ఇవి ప్రస్తుతసందర్భానుసారంగా కొంచెం మార్చబడ్డ పినవీరన జైమినిభారతంలోని పద్యములు.

# వాణి నారాణి

## మొదటి దృశ్యం

(సమయం: మధ్యాహ్నం 3 గంటలు. స్థలము విజయనగరసమ్రాట్టు సాళువ నరసింహరాయల సాహితీసభామండపం. నేపథ్యంలో వందిమాగధులు జయగీతికలు, ఆ తర్వాత వేదవిప్రులు 'ధ్రువం తే' అను మంత్రమును చదువుచుండగా, మంత్రికవి పండితులతో గూడిన సభామందిరాన్ని అతడు ప్రవేశించి సింహాసనాసీను డౌతాడు.

వందిమాగధులు:

విజయనగరసామ్రాజ్యాధీశ్వర, రాజాధిరాజ, రాజపరమేశ్వర!

జయము! జయము!

నిఖిలదక్షిణాపథభూభారధౌరేయ, మేదినీవరాహబిరుదాంక! జయము!

జయము!

దుర్వారగర్వితారివిదళనకరవాల, కటారిసాళువబిరుదాంక!

జయము! జయము!

పాండురయశోగండూషితనిర్ఝరాపగాకాండ, గుండయనరసింహ

భూమండలాఖండల! జయము! జయము!

వేదవిప్రులు: ధ్రువం తే రాజా వరుణో ధ్రువం దేవో బృహస్పతిః।

ధ్రువన్త ఇన్ద్రశ్చాగ్నిశ్చ రాష్ట్రం ధారయ తాం ధ్రువమ్॥ )

రాయలు: మంత్రిసత్తములు, కవిసత్తములు, వేదమూర్తులైన బ్రాహ్మణోత్తములతో బ్రశస్తమైన ఈ సభకు నమస్కారము. మాపరిపాలనలో మీ సుఖసంపదలకు లోటు లేదు కదా!